వానొస్తే.. మడుగే..

అధ్వానంగా పెద్దాస్పత్రి పరిసరాలు

- చిన్నపాటి వర్షానికే నిలుస్తున్న నీరు
- పారిశుద్ధ్య సమస్యతో తప్పని తిప్పలు



క్షయ వార్డు చుట్టూ నిలిచిన వర్షపు నీరు

ఖమ్మంవైద్యవిభాగం: వర్షాకాల సీజన్‌లో పెద్దాస్పత్రి పరిసరాలు మడుగులా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే పలు చోట్ల నీరు చేరి అధ్వానంగా తయారవుతోంది. నీరు చాలా రోజుల పాటు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది, రోగులకు ఇబ్బందులు కలగజేస్తున్నాయి. పెద్దాస్పత్రికి జిల్లా నలుమూలల నుంచి పలు రకాల సమస్యలతో వచ్చే రోగులు పరిసరాల అపరిశుభ్రతతో దోమల బారిన పడి మరింత ఇబ్బంది పడుతున్నారు.

విభాగాల వద్ద నిలుస్తున్న నీరు..

వర్షం వచ్చిన సమయంలో భారీగా నీరు చేరి పలు విభాగాల వద్ద మడుగులా తయారవుతోంది. అలా చాలా రోజులు నిల్వ ఉండి దోమల వ్యాప్తికి కారణమవుతోంది. ఆస్పత్రి పరిసరాల్లో చాలా ప్రాంతాల్లో గుంతలమయంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికి సైతం ఆయా ప్రాంతంలో వర్షపునీరు చేరిపోతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలోని పలు విభాగాల్లో కిటికీలకు మెస్‌లు లేకపోవటంతో దోమలు వార్డుల్లోకి చేరి వాటి బారిన పడాల్సి వస్తోంది. అసలే వివిధ రకాల వ్యాధులతో వచ్చే రోగులకు దోమల వ్యాప్తితో డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా తదితర వ్యాధులకు గురయ్యే అవకాశం కలుగుతోంది.



మాతా శిశు ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో..

పాడైన అంతర్గత రోడ్లు.. కురుస్తున్న పాతభవనం

ఆస్పత్రిలోని పలు విభాగాల వద్ద వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు ఏర్పడుతుండటంతో పాటు అంతర్గత రోడ్లతో కూడా ప్రధాన సమస్యగా తయారైంది. ఆస్పత్రి చుట్టూ దశాబ్దం క్రితం ర్పాటు చేసిన అంతర్గత రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. కంకర తేలి, గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు అందులో చేరి ఆస్పత్రికి వచ్చే వారికి ఇబ్బందిగా మారింది. దీనికి తోడు పాత ఆస్పత్రి భవనం నిర్మించి సుమారు 63 ఏళ్లు దాటింది. పాత భవనంలో కార్యాలయంతో పాటు పలు విభాగాలుండగా చిన్నపాటి వర్షానికి సైతం కురుస్తోంది. దీంతో కార్యాలయంలోని ఫైల్స్, కంప్యూటర్లు, ఇతర సామగ్రి తడిచిపోతున్నాయి. వర్షం వచ్చినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రతిపాదనలు పెట్టినప్పుడల్లా చిన్న పాటి మరమ్మతులు చేయటం, ఆ తర్వాత యథాప్రకారం కురవటం సర్వసాధారణమైంది. శాశ్వత భవనం నిర్మించాలనే ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంతర్గత రోడ్లు, కొత్త భవనం, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



తెలంగాణ డయాగ్నస్టిక్ వద్ద నిలిచిన నీరు

ఆస్పత్రి రూపరేఖలు మారనున్నాయి..



త్వరలో పెద్దాస్పత్రి రూపురేఖలు మారనున్నాయి. అంతర్గత రోడ్లతో పాటు, పలు విభాగాల వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం పాటు, పాత భవనం స్థానంలో నూతన భవనం రానుంది. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి రూ.10 కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉంది. వాటితో ఆస్పత్రి చుట్టూ డివైడర్‌తో డబుల్ రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోనున్నాం. కొత్త భవనంతో పాటు ఇతర విభాగాలను ఆధునీకీకరించే అవకాశం ఉంది. ఓపీ, ఇతర విభా గాల రూపురేఖలు మారనున్నాయి. మెరుగైన చికిత్సలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– యం. నరేందర్, మెడికల్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

హాస్టల్‌కు వాటర్‌ఫిల్టర్..



వాటర్‌ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లోని గోకుల్ కృష్ణ సేవా సమితి ట్రస్ట్ నిర్వహిస్తున్న గోకుల్ బాయ్స్ హాస్టల్‌కు మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు రూ.80,000 విలువైన వాటర్ ఫిల్టర్‌ను వితరణగా అందజేశారు. ఈ మేరకు సోమవారం ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరినాథ్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కూరాకుల నాగభూషణం , గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగాని వెంకన్న, తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కోడి లింగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ భారీ మల్సూర్, నాయకులు మూడుముంతుల గంగరాజు, అకడమిక్ కన్వీనర్ బట్టు శ్రీనివాస్, నాయకులు దానయ్య, పంది రాజు, బీసీ జేఏసీ కన్వీనర్ పెరుగు వెంకటరమణ, యాదాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరదతో మత్స్యకారులకు భారీ నష్టం

ఖమ్మంఅర్బన్: ఎడతెరపిలేకుండా ఆదివారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షంతో నగరంలోని ధంసలాపురం పెద్ద చెరువులో వరద ప్రవహించి తీవ్ర నష్టం కలిగిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు చేరడంతో గుర్రపుడెక్క అలుగు వైపు కొట్టుకువచ్చింది. అలుగు వద్ద చేపలు కొట్టుకుపోకుండా వేసిన వలలు ధ్వంసమయ్యాయి. దీంతో చెరువులో ఉన్న చేపలు, చేప పిల్లలు వరదలో కొట్టుకుపోయాయని మత్స్యకారులు వాపోయారు. చెరువుపై ఆధారపడి 80 కుటుంబాలు జీవిస్తున్నాయని మత్స్యసంఘం అధ్యక్షుడు ముద్రబోయిన అప్పారావు తెలిపారు. ఇటీవల ఒక్కో కుటుంబం రూ.20 వేలు చొప్పున సేకరించి రూ.12 లక్షలు వెచ్చించి రెండు లక్షల చేప పిల్లలు వదిలి, కొత్త వలలు వేసినట్లు తెలిపారు. గతేడాది కూడా వరదలతో నష్టపోయినా ఇప్పటివరకు పరిహారం అందలేదని, ప్రభుత్వం తక్షణమే సాయం అందించాలని అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు చెరువును జలవనరుల శాఖ డీఈ ఉదయ్‌పతాప్ సందర్శించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: వాసవీ వారోత్సవాలు, వాసవీ క్లబ్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతి సందర్భంగా సోమవారం నగరంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మం నగర వాసవీ క్లబ్ అధ్యక్షులు పసుమర్తి రామ్మోహన్ రావు, గాంధీ చౌక్ క్లబ్ అధ్యక్షురాలు ధనారపు వాసవీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా క్లబ్ గవర్నర్ కొత్త వెంకటేశ్వర రావు, గుంటుపల్లి దివాకర్ గుప్తా, పెచ్చా కృష్ణ మోహన్, పసుమర్తి శ్రీనివాస రావు, చిన్న లక్ష్మీ, భవాని తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	కొత్తలోక, మహావతార్ నర్సింహా
సాయిరాం	బ్రహ్మాండ
ఆదిత్య	సుందరకాండ, త్రిబాణాధారి బార్బరిక్
శ్రీనివాస	వార్ 2

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	40	బచ్చలికూర	4
వంకాయ	46		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	50		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	140		20
బీర	50	తోటకూర	4
దొండ	46		20
పొట్లకాయ	46	గోంగూర	4
చిక్కుడు	66		20
గోరుచిక్కుడు	46	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	45	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		25
చామగడ్డ	32	పుదీన	1
క్యారెట్	50		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



రఘునాథపాలెం: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



కామేపల్లిలో..

రఘునాథపాలెం: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ వేపకుంట్ల పాఠశాలలో జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గాయత్రి, నాయకులు జబ్బార్, ఉపాధ్యాయులు సులోచన, సోమ్లా, రమేష్, మల్లికార్జున్, రమాదేవి, గీత, సునీలారాణి, సుమలత, వెంకట్రామమ్మ, జావెద్ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి: పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా కొమ్మినేపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కాంట్రీబ్యూటరీ పెన్షన్ పథకంను రద్దు చేసి పాత పెన్షన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులుగా వినయ్, శ్రీను

తిరుమలాయపాలెం: డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులుగా మండలంలోని జూపెడకు చెందిన దోనెపల్లి వినయ్‌కుమార్, జల్లెపల్లికు చెందిన అల్లి శ్రీను ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జరిగిన జిల్లా మహాసభల్లో ఇద్దరికి జిల్లా కమిటీలో అవకాశం కల్పించారు. యువత సమస్యలు, ఉపాధి అవకాశాలపై ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.

నివాళి..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లో మద్దినేని అనంతరామయ్య మొదటి వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, ఆర్‌టీఏ సభ్యుడు గజ్జెల వెంకన్న, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్, చావా నారాయణ, గజ్జి సూర్యనారాయణ ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు..

రఘునాథపాలెం: మండలంలోని లచ్చిరాంతండా మాజీసర్పంచ్ బాబిచంద్ మృతిపై మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేసిన చంద్ సేవలు మరువలేనివని, ఆయన మరణం తీరని లోటని తెలిపారు.

వసతి గృహాలపై చిత్తశుద్ధి కరువు



భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: ప్రభుత్వ వసతి గృహాలపై పాలకులకు చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు సాదె పొంగు ప్రశాంత్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలను యూత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల ఆవరణమంతా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ముక్తవరపు కిషోర్, పట్టణ అధ్యక్షుడు పగిడికత్తుల శ్రీకాంత్, వినయ్, విజయ్, సాయి, దీపక్, వేణు, వెంకటేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న నాయకులు, విద్యార్థులు

ఖమ్మం మామిళ్లగూడెం: పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌తో పాటు ఫీజు రియింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు తిప్పారపు లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఖమ్మంలో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను గాలికి వదిలేసిందని, రెండేళ్లుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మంట్, కాస్మోటిక్, డైట్ బిల్లులు విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో ఉందన్నారు. విద్యార్థి పోరుబాటయాత్ర జిల్లాలో పర్యటించి విద్యార్థులను వేధిస్తున్న అనేక సమస్యలు గుర్తించిందన్నారు. నాయకులు యశ్వంత్, నజీర్, వెంకటేష్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీకి ఏర్పాట్లు..

తిరుమలాయపాలెం: సొసైటీ ఎరువుల కేంద్రాలతో పాటు గ్రామ పంచాయతీల వారీగా బుధవారం యూరియా పంపిణీ చేసేందుకు వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని తిరుమలాయపాలెం, జల్లెపల్లి, బీరోలు, పిండిప్రోలు సహకార ఎరువుల కేంద్రాలతో పాటు 10 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్‌తో ఆయా కేంద్రాలకు వెళ్లి ఒక యూరియా బస్తాను తీసుకోవాలని, తొందరపడొద్దని దఫదఫాలుగా యూరియాను పంపిణీ రైతులు సహకరించాలని తెలిపారు.

నేలకొండపల్లి: మండలంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో బుధవారం యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏఓ యం.రాధ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ పాస్ మిషన్‌లో వేలిముద్రతో యూరియా ఇస్తామని, రైతులు సహకరించాలని కోరారు.

ఈనెల 8న రక్తదాన శిబిరం

ఖమ్మంఅర్బన్: విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగాజరిగిన బషీర్‌బాగ్ ఉద్యమంలో పోలీసుల లాఠీ దెబ్బలకు ఆస్పత్రిపాలై మృత్యువుతో పోరాడి 2000 సెప్టెంబర్ 8న ప్రాణాలు కోల్పోయిన ఖమ్మం డీవైఎఫ్ఐ నాయకుడు సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ తెలిపారు. సోమవారం ఖానాపురం హవేలీ పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నగరంలోని ఇందిరానగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగే ఈ శిబిరంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని తలసేమియా బాధిత చిన్నారుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రజుమంలో మండల కార్యదర్శి దొంగలు తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య, పోతురాజు వెంకటి, కత్తుల అమరావతి, గాలి వెంకటాద్రి, జట్ల ఆనందరావు, శ్రీను, అంజయ్య, నాగరాజు, చారు ప్రసాద్, వేదగిరి మురహరి, మాచర్ల గోపాల్, కుర్రి రవి పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్: ఈనెల12న ఖమ్మంలో నిర్వహించే బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నామని, భవిష్యత్‌లో కూడా మరిన్ని పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు మేడికొండ నాగేశ్వరరావు, గూడా రాంబ్రహ్మం, పీవీ. రమణ, రాజశేఖర్, రాములు, వెంకన్న, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులు పరిష్కరించండి



జవాన్లకు సూచనలు చేస్తున్న కమిషనర్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థతో పాటు జోనల్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు అందించే ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. కేఎంసీ కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్ వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేశారు. కేఎంసీలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 31 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన..

నగరంలోని 31, 32వ డివిజన్‌లో కమిషనర్ అభిషేక్ అగస్త్య పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని డ్రెయినేజీలను శుభ్రం చేయాలని, మురుగు కాల్వల్లో చెత్త లేకుండా చూడాలని ఆదేశించారు. డ్రెయినేజీల వెంట పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు.

ఆర్టీసీ పరిరక్షణకు పోరాటమే మార్గం



మాట్లాడుతున్న దండి సురేష్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఒక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుందని, సంస్థ అస్తిత్వమే ప్రమాదంలో పడిందని దాని పరిరక్షణకు పోరాటమే మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం డిపో కమిటీ సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో పిల్లి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో క్రమేపి ప్రైవేటీకరణకు అవకాశం కల్పిస్తుందని, ఇప్పటికే కొన్ని డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించారన్నారు. ఆర్టీసీ పరిరక్షణకు హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సంస్థను ప్రైవేటీకరణ చేసే దిశగా ఆలోచన చేయడం శోచనీయమన్నారు. వేధింపుల పర్వం ప్రారంభమైందని కార్మికులను వేధిస్తే సహించబోమన్నారు. ఈ సమావేశంలో సంఘ డిపో అధ్యక్షులు జగన్నాథం, కార్యదర్శి బుచ్చిబాబు, డిపో చైర్మన్ సిహెచ్.రమేష్, డిపో కోశాధికారి వెంకన్న, నాయకులు ఆదిలక్ష్మి, సుల్తానా, రమాదేవి, నాగమణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సురేష్‌ను సత్కరించారు.

టీజేఎస్‌తోనే సామాజిక న్యాయం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారులకు సామాజిక న్యాయం టీజేఎస్‌తోనే సాధ్యమని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి గోపగాని శంకర్ రావు అన్నారు. సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ముదిగొండ మండలంలో వీవీ కృష్ణాపురంలో పరికపల్లి ఎల్లయ్య గౌడ్ ఆధ్వర్యంలో పలువురు టీజేఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జిల్లా పార్టీ అడక్ కమిటీ ప్రధాన కార్యదర్శి బట్టు రాజేందర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గోపగాని మాట్లాడుతూ.. ఈనెల 8న ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

వినతి...



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: బడులు, గుడుల ప్రాంతాల పరిధిలో వైన్‌షాపులు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో బీఎస్పీ నాయకులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. మండలంలో ఇప్పటికే కేటాయించిన వైన్‌షాపులను, కేటాయించబోయే వైన్‌షాపులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, కొమ్ము పూలే పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నియోజకవర్గానికి చెందిన వేముల పిచ్చమ్మ, గాదే కృపారాణి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త సంఘాల ఏర్పాటు వేగవంతం చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగర పరిధిలో కొత్త మహిళ సంఘాల ఏర్పాటును వేగవంతం చేయాలని టీఎంసీ జి.సుజాత అన్నారు. సోమవారం కేఎంసీలోని సమావేశ మందిరంలో ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... స్వయం సహాయక సంఘాల్లో లేని మహిళలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, వారితో కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం నిర్వహించే డ్రైడేలో ఆర్పీలు పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో సీవోలు సల్మా, రోజ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: మండలంలోని గరిడేపల్లి గ్రామంలో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదంటూ సోమవారం గ్రామస్తులు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాగునీరు లేక వ్యవసాయ బావుల నుంచి తెచ్చుకుంటున్నామని, ఇప్పటి వరకు అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. కాగా స్పందించిన అధికారులు ఓ రైతుకు సంబంధించిన బోరుబావిని లీజ్‌కు తీసుకొని సాయంత్రానికి తాగునీటి సరఫరా చేశారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

ఖమ్మంమయూరిసెంటర్: జన శిక్షణ సంస్థాన్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పొందిన మహిళలకు సోమవారం కార్పొరేటర్ షేక్ మక్బూల్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మక్బూల్ మాట్లాడుతూ..శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ బాధ్యులు రాధాకృష్ణ, శాంతి, షేక్ లాల, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెంకు చెందిన పలువురు మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు నంబూరి రామారావు, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, గోవిందరావు, బోయిన బ్రహ్మం, లక్ష్మీనారాయణ, సూరేపల్లి ప్రేమ్‌కుమార్, సూరేపల్లి ప్రభాకర్, బోయిన సారథి, రామయ్య, లక్క తిరపయ్య, నరేందర్, సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

గణపయ్యకు పూజలు



ఖమ్మంక్రైం: పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న సీపీ సునీల్‌దత్



ఖమ్మం మామిళ్లగూడెం: బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక మండపాల్లో గణపయ్యకు పూజలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు శనివారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: 54 రకాల నైవేద్యాలతో..



ఖమ్మంగాంధీచౌక్: మోతీనగర్‌లో..